క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఏలూరు (టూటౌన్): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యం అభినందించింది. స్థానిక శాంతినగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల పాఠశాల చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించారని రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రీజనల్ ఇన్‌చార్జి ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి కారకులైన తల్లిదండ్రులు సదా స్మరణీయులని అన్నారు. ప్రిన్సిపాల్ ఐవీ సుధాకర్, శారద మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జెసెఫ్, విజయ్ అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధార్థ క్వెస్ట్ వార్షికోత్సవం



అతిథులను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఏలూరు (టూటౌన్): విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఏలూరులో సిద్ధార్థ క్వెస్ట్ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. తొలుత చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కోనేరు సురేష్‌బాబు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛీకరణకు సహకరించాలి

ఏలూరు(మెట్రో) : ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు జిల్లాలోని అన్ని రాజకీయపక్షాల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు.

కాలుష్యం కోరల్లో కృష్ణా కాలువ

- డంపింగ్ యార్డును తలపిస్తున్న కాలువ గట్టు
- వర్షం వస్తే కాలువలోకి వ్యర్థాలు
- ఏలూరు గూడ్స్ షెడ్ రోడ్డు వెంబడి కిలో మీటరు దూరం ఇదే పరిస్థితి
- తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న వాహనచోదకులు



గూడ్స్ షెడ్డు ఎదురుగా కృష్ణా కాలువ గట్టుపై ఉన్న వ్యర్థాలు



కొబ్బరి బొండాలు, గడ్డి వంటి చెత్త గుట్ట

ఏలూరు (టూటౌన్): ఏలూరు గూడ్స్ షెడ్ రోడ్డు నుంచి పాత టోల్ గేట్ వంతెన వరకు దాదాపు కిలో మీటరు దూరం కృష్ణా కాలువ గట్టు డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఏలూరు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన చెత్తను కాలువ గట్టుపై డంప్ చేస్తున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను సైతం కాలువ గట్టుపైనే పారేస్తున్నారు. ఏలూరు నగరంలోకి వచ్చి వెళ్లే ఈ మార్గం మొత్తం వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యర్థాల డంప్‌ను అరికట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాలువలోకే చెత్తా చెదారం

ఇబ్బడి ముబ్బడిగా కృష్ణా కాలువ వెంబడి వ్యర్థాలు, చెత్తా చెదారాలను వేయడంతో అవి వర్షాలు పడితే కాలువలోకి జారుతున్నాయి. దీంతో కృష్ణా కాలువ చివర వరకు నీరు పారని పరిస్థితి ఏర్పడింది. వేసవిలోనే ఈ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కాలువను కాలుష్య కారకాల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన సమన్వయం

ఏలూరు గూడ్సు షెడ్డు రోడ్డు వెంబడి తూర్పు లాకుల వరకు ఉన్న కృష్ణా కాలువను ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ శాఖల అధికారులు పర్యవేక్షించాలి. ఈ మూడు శాఖల మధ్య సమన్వయం కొరవడి తమది కాదంటే తమది కాదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ సమస్యను పరిష్కరించాలని నగర, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

ప్రక్షాళన అవసరం

సాక్షాత్తు జిల్లా స్థాయి అధికారులు కృష్ణా కాలువలోని చెత్తా, చెదారం, ఇతర వ్యర్థాలను శుభ్రం చేసేందుకు స్వచ్ఛాంధ్ర, క్లీన్ ఆంధ్రా, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హడావుడిగా చేసే ఇటువంటి కార్యక్రమాల వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, పూర్తిస్థాయి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.

వ్యర్థాల డంప్‌ను అరికట్టాలి

ఏలూరు నగరం మధ్య నుంచి వెళుతున్న కృష్ణా కాలువ వెంబడి వ్యర్థాల డంప్‌ను అరికట్టాలి. అవసరమైతే కాలువ వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అయినా ఫలితం లేకపోతే జరిమానా విధించాలి. మొక్కుబడి చర్యలతో ప్రయోజనం ఉండదు.



– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

క్లాప్ ఆటోల నిలుపుదలతోనే సమస్య

ఏలూరు నగరంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇంటింటా చెత్తను తరలించే క్లాప్ ఆటో సేవలను నిలిపివేశారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకు పోతోంది. మార్కెట్ ప్రాంతాల్లో వచ్చే చెత్త, ఖాళీ కొబ్బరి బొండాలు ఎక్కడిడడితే అక్కడే పాడేస్తున్నారు.



– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, ఏలూరు

మలేరియా దినోత్సవ ర్యాలీ



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు కె.ప్రదీప్ చంద్ర, కె.కృష్ణ, ఎంపీహెచ్‌జీఓ ఎంవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీహెచ్ఎన్, ఏఎన్ఎం, ఆశ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు

వెంకట్రావు మరణం తీరని లోటు



మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మారిన వెంకట్రావు మృతి కార్మిక వర్గానికి, జట్లు లాగుడు బండ్ల కార్మికులకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అన్నారు. వెంకట్రావు(73) గురువారం సాయంత్రం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందారని తెలిపారు. శ్మశాన వాటికలో సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సభలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంకట్రావు మృతికి సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా సమితులు తరుపున సంతాపం తెలిపారు. వెంకట్రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

మందుకు డబ్బులు ఇవ్వలేదని..

ఏలూరు టౌన్: వన్‌టౌన్ పెద్దమార్కెట్ ప్రాంతంలో మోటారు సైకిల్‌పై వెళుతూ వ్యక్తిని మరో వ్యక్తి ఆపి మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. తనదగ్గర లేవని చెప్పటంతో రాయితో దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత బస్టాండ్ సమీపంలోని పాండురంగాపురానికి చెందిన మహేష్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై వన్‌టౌన్‌లోని పెద్ద మార్కెట్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో వెంకటాపురం పంచాయతీ మారుతీనగర్ ప్రాంతానికి చెందిన సతీష్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌ను ఆపి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పటంతో రాయితో మహేష్‌పై దాడి చేయటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన



శాంతి ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారికి నివాళులర్పిస్తూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పవర్ పేట సీపీఎం కార్యాలయం నుంచి బయలుదేరి వసంత మహల్ సెంటర్ చేరుకొని కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఘటనను యావత్ సమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.నరసింహారావు, కె.రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు, ఎ.శ్యామల రాణి, కె.విజయలక్ష్మి, ఎస్ఎన్ రమేష్, ఎం ఇస్సాక్, బి.సోమయ్య, పి.రవికుమార్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ఏలూరు (టూటౌన్): జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఏలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏలూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్ మోహన్, కాశే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ, గాయపడ్డ బాధితులకు కేంద్ర భరోసా ఇవ్వాలని కోరారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు భారతదేశ కాశ్మీర్ లోయలో దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దేశంలో ఉగ్రవాద చర్యలను నిర్మూలించడానికి కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కోశాధికారి ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సీపీఎంను విమర్శించడం దారుణం

గణపవరం: నిరంతరం ప్రజల పక్షాన, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడే సీపీఎం పార్టీని, నాయకులను విమర్శించే నైతిక హక్కు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు లేదని సీపీఎం నాయకులు విమర్శించారు. పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లు కూల్చి నిరాశ్రయులను చేసిన సందర్భంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన రఘురామకృష్ణంరాజు పేదల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎంపై అక్కసు వెళ్లబోసుకోవడం తగదన్నారు. వెంటనే కూల్చివేసిన పేదల ఇళ్లను పునర్నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



కేశవరంలో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

ఈసందర్భంగా రఘురామకృష్ణం రాజు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెచ్చెట్టి నర్సింహమూర్తి, ఎం.పెంటారావు, నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవరావు, చిన్నం చిననాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మేధోసంపత్తి హక్కుల దినోత్సవం

పాలకొల్లు(సెంట్రల్) : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాలలో శనివారం ప్రపంచ మేధో సంపత్తి హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రసాయన శాస్త్ర విభాగం, ఐక్యూ ఏసీ ఇనిస్టిట్యూట్‌ఇన్నోవేషన్ కౌన్సిల్ విభాగాల ఆధ్వర్యంలో మేధోసంపత్తి హక్కులపై జాతీయస్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌రు డాక్టర్ రాజు గగ్రపు, సైంటిస్ట్, ఐఐసీటి, హైదరాబాద్ వారు హాజరౌతారని వివరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	30	బీన్సచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	54
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	32	బీట్‌రూట్	30
బీరకాయలు	30-34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30-34	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

శిశు గృహంలో సౌకర్యాలపై ఆరా



విద్యానగర్‌లోని శిశు గృహ రికార్డులను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్థానిక విద్యానగర్ ప్రభుత్వ శిశు గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ శుక్రవారం సదర్శించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలచే నిర్వహించే వసతి గృహాలను తనిఖీలు చేసి, నివేదికలు పంపించాల్సి ఉందని చెప్పారు. ఈ మేరకు తాను శిశు గృహాన్ని సందర్శించినట్టు తెలిపారు. అనంతరం బాలలకు అందుతున్న ఆహార, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పౌష్టిక ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (టూటౌన్): కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో స్తంభాల మార్పిడి పనుల నిమిత్తం శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కేపీ అంబేద్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరుగుచెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కొల్లేరులో సీపీఎం నేతల పర్యటన

దెందులూరు: కొల్లేరులో శనివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం కొల్లేరు ప్రాంతంలో పర్యటిస్తారని కె.శ్రీనివాస్ తెలిపారు. గుడివాకలంకలో ఉదయం 9 గంటలకు కొల్లేరు ప్రజలతో సమావేశమై 10.30 గంటలకు పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు పరిశీలన చేస్తారు. 11 గంటలకు కొవ్వాడ లంక గ్రామంలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారన్నారు.

నేటి నుంచి శిక్షణ

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఈనెల 26, 27, 28 తేదీల్లో జిల్లా శిక్షణా తరగతులు ఏలూరులో ఏర్పాటుచేశామని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) ఏలూరు జిల్లా కమిటీ తెలిపింది. మున్సిప ల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ యూనియన్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. ఈ తరగతులకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాలిటీలకు చెందిన కార్మికులు హాజరవుతున్నారని వివరించారు.

చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు

నిడమర్రు: చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తే చెరువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శుక్రవారం తోకలపల్లి సామాజిక భవనం వద్ద చికెన్ వేస్ట్ వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్ మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం చేపడితే ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. కోళ్ల వ్యర్థాల వినియోగం కొల్లేరు గ్రామాల్లో ఎక్కువగా ఉందని కోళ్ల వ్యర్థాలను వాహనాల మీద తరలించే వారితోపాటు వాటిని వినియోగించే చెరువుల రైతులపైనా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇటీవల 30 కేసుల వరకూ నమోదు చేసామన్నారు. కోళ్ల వ్యర్థాలను తరలించినా, వినియోగించిన స్థానిక పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై వీర ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గున్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఎంవీ సుభాష్

వీడని ప్లాస్టిక్ భూతం!

- విరివిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- పట్టించుకోని అధికారులు



ప్లాస్టిక్ కవర్లతో కూరగాయలు



వ్యర్థాల్లో ఎక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు

దెందులూరు: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రతిబంధకంగా మారాయి. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు మానవాళి మనుగడను ప్రశ్నిస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగం తగ్గకపోగా విపరీతంగా దాదాపు అన్ని అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం ఆందోళన రేకెత్తించే ప్రధాన అంశంగా మారింది. ప్రజల ప్రాణాలకు హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని అధికారులు సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం మాత్రం విచ్చలవిడిగా కొనసాగుతుంది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర , స్వచ్ఛ దివస్ రోజు మాత్రమే స్వచ్ఛభారత్...ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీలు, నిర్వహిస్తున్న అధికారులు, యంత్రాంగం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదు. డ్వాక్రా మహిళల ద్వారా మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాలోకి తెచ్చి ఓ వైపు ప్లాస్టిక్ నిషేధంతో పాటు మరోవైపు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను యంత్రాంగం నేటికీ అమలు చేయడం లేదు.

రోజు టన్ను ప్లాస్టిక్ వ్యర్థాలు

లక్షన్నర జనాభా కలిగిన దెందూలూరులో టన్నుల వరకూ చెత్తాచెదారంతో కూడిన వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. ఇందులో ఒక టన్ను పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికులు రోజూ ఈ వ్యర్థాలను తొలగిస్తున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు కనిపిస్తూనే ఉన్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లు, మురుగు కాలువల్లో వేస్తుండడంతో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది.

ఆకస్మిక తనిఖీలు, జరిమానాలేవా?

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు గతంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న, వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించేవారు. దీంతో గతంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంత తగ్గింది. కానీ ప్రస్తుతం పారిశుద్ధ్యన్ని పరిశీలిస్తున్నట్లు సమాజిక మాధ్యమాల్లో ఫోటోలను షేర్ చేస్తున్నారే తప్ప ప్లాస్టిక్ నిషేదంపై దృష్టి సారించడం లేదన్నది పర్యావరణ హితులు విమర్శిస్తున్నారు.

క్లాత్ బ్యాగ్స్ వినియోగమేదీ?

పాలిథిన్ కవర్ల స్థానంలో క్లాత్ బ్యాగ్స్‌ను డ్వాక్రా మహిళ ద్వారా తయారు చేయించి వాటిని మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు, హోల్‌సేల్ వ్యాపారస్తులకు విక్రయించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిర్ణయించారు. తర్వారా ప్లాస్టిక్ నిషేధంతో పాటు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి పాటు పడాలని సంకల్పించారు. కానీ ప్రస్తుతం కొనసాగుతన్న ఆదిశగా దృష్టి సారించడం లేదు.

ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి



ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలు స్వచ్ఛంద భాగస్వాములు కావాలి భావితరాలు సంపూర్ణ ఆరోగ్య గ్రామాలుగా వ్యక్తులుగా జీవించాలంటే ప్రతి వ్యక్తి స్వతంత్రంగా స్వచ్ఛందంగా ఈ ఉద్యమంలో ఐక్యత భావంతో కూడిన సేవలు అందించాలి. ప్రజాభాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయినా సంపూర్ణ ఫలితాలు సాధించడం జరుగుతుంది.

– డాక్టర్ పవన్ వైద్యాధికారి దెందులూరు సీహెచ్‌సీ